మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
శనివారం | 19 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 10


# చంద్రబాబు చేతుల మీదుగా..నేడు విశాఖలో చారిత్రక ఘట్టం

**- విశాఖలో 40 ఏళ్ల సమస్యకు కూటమి ప్రభుత్వం పరిష్కారం**
**- 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ**
**- 8,874 కోట్ల విలువైన 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ..ఇంటిపై పూర్తి హక్కు**

**విశాఖపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నంలో దశాబ్దాలుగా నెలకొన్న ఒక జటిల సమస్యకు పరిష్కారం లభించింది. ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని, వాటిపై యాజమాన్య హక్కుల కోసం 40 ఏళ్లుగా ఎదురుచూస్తున్న వేలాది పేద, మధ్య తరగతి కుటుంబాల కల రేపు సాకారం కానుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విశాఖపట్నం వేదికగా ఈ చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. మొత్తం 28,445 కుటుంబాలకు రూ.8,874 కోట్ల విలువైన భూమిపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలను అందజేయనున్నారు.

**దశాబ్దాల సమస్యకు ఫుల్‌స్టాప్**

విశాఖ నగర పరిధిలోని అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో పేదలు ఇళ్లు నిర్మించుకుని దశాబ్దాలుగా నివసిస్తున్నారు. అయితే, ఆ ఇంటి స్థలంపై వారికి పూర్తి హక్కులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్తిని అమ్ముకోలేని, బదలాయించలేని పరిస్థితితో పాటు, భవిష్యత్తుపై భరోసా కరవైంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. మొత్తం 399 ఎకరాల విస్తీర్ణంలోని 19,33,853 చదరపు గజాల భూమిని క్రమబద్ధీకరించి, ఆయా కుటుంబాలకు పూర్తి హక్కులు కల్పించేందుకు రంగం సిద్ధం చేసింది. విశాఖలో ఇంత భారీ స్థాయిలో భూముల క్రమబద్ధీకరణ చేపట్టి పట్టాలు


2వ పేజీలో

## పోలీసు సంక్షేమ అంగ్ల పాఠశాలలో కమ్యునికేషన్ స్కిల్ టీచర్ ఉద్యోగం

### విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్


2వ పేజీలో

**విజయనగరం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** విజయనగరం జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీస్ బ్యారక్స్ నందు నడపబడుచున్న పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో కమ్యునికేషన్ స్కిల్ టీచర్ పోస్టును భర్తీ చేయనున్నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్తెలిపారు. పై ఉద్యోగంకు దరఖాస్తు చేసుకొనే అభ్యర్ధులు తమ విద్యార్హతలతో పాటు, ఖచ్చితంగా ఆంగ్లంలో భోదన చేయగలిగిన సామర్థ్యం ఉండాలన్నారు. ఉద్యోగ విద్యార్హత వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నవి. కమ్యునికేషన్ స్కిల్ టీచర్ - ఖాళీ - 01 ఎం ఏ ఇంగ్లీష్ లేదా ఎంబీఏ హెచ్ఆర్ విద్యార్హతతో పాటు ఆంగ్లంలో భోదన చేయగలిగిన సామర్థ్యం కలిగి ఉండాలి.పైన తెలిపిన పోస్టు భర్తీ కొరకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు (మంచి కమ్యునికేషన్ స్కిల్స్) సెప్టెంబర్ 23న ఉదయం 10.30

## సింహాచలం కళా వేదికపై నేడు, రేపు భక్తిరంజక సాంస్కృతిక కార్యక్రమాలు

**సింహాచలం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** సింహాచలం శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో కళావేదికపై భక్తులను అలరించే విధంగా నేడు, రేపు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కార్య నిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు.శనివారం (19.09.2026) సింహాచలం కళావేదికపై విశాఖపట్నానికి చెందిన శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారిచే భక్తిరంజకమైన 'కీర్తన కచేరీ' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 5.00 గంటల నుంచి రాత్రి 7.00 గంటల వరకు కొనసాగుతుంది. ఆదివారం (20.09.2026) సాయంత్రం 3.00 గంటల నుంచి 5.00 గంటల వరకు రాజమహేంద్రవరానికి చెందిన శ్రీ దుర్గ నృత్య కళానిలయం బృందం ఆధ్వర్యంలో విశిష్టమైన 'కూచిపూడి నృత్య ప్రదర్శన' నిర్వహించనున్నారు.


2వ పేజీలో

# చంద్రబాబు చేతుల మీదుగా..నేడు విశాఖలో చారిత్రక ఘట్టం

**ఒకటి తరువాయి**

పంపిణీ చేయడం ఇదే తొలిసారి.

**పేద కుటుంబాల కలను నిజం చేస్తున్నా: సీఎం చంద్రబాబు**

ఈ కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఎక్స్' వేదికగా స్పందించారు. "తమకంటూ పూర్తి హక్కులతో సొంతిల్లు ఉండాలనేది ప్రతి ఒక్క కుటుంబ కల. అలాంటి వేల మంది కలను నిజం చేసేందుకే విశాఖ వస్తున్నా" అని ఆయన పోస్ట్ చేశారు. ఇది కేవలం పట్టాల పంపిణీ కాదని, 28 వేల కుటుంబాలకు వారి నివాసాలపై పూర్తి హక్కు కల్పించే చరిత్రాత్మక సందర్భమని పేర్కొన్నారు. ఈ పట్టాతో ప్రతి కుటుంబానికి విలువైన ఆస్తి, భవిష్యత్తుకు భద్రత, పిల్లలకు వారసత్వ సంపదతో పాటు ఆత్మగౌరవం, భరోసా లభిస్తాయని సీఎం వివరించారు. దశాబ్దాలుగా ఎదురుచూసిన కుటుంబాల ఆనందం చూడటమే ప్రభుత్వానికి నిజమైన సంతృప్తి అని ఆయన అన్నారు. 2014-19 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించి కొన్ని జీవోలను జారీ చేసినా, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో అది పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా సమీక్షల్లో ప్రజాప్రతినిధులు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకురావడంతో, అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లోని ఇళ్లను క్రమబద్ధీకరించాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**మండలాల వారీగా లబ్ధిదారులు**

ఈ క్రమబద్ధీకరణ ద్వారా గాజువాక నుంచి భీమిలి వరకు అనేక ప్రాంతాల కుటుంబాలు లబ్ధి పొందనున్నాయి. అత్యధికంగా విశాఖ రూరల్‌లో 9,261 కుటుంబాలు, గాజువాకలో 4,353, ములగాడలో 4,213, గోపాలపట్నంలో 3,253, పెందుర్తిలో 2,722,



పెదగంట్యాడలో 1,910, మహారాణిపేటలో 1,235, సీతమ్మధారలో 668, భీమిలిలో 464, ఆనందపురంలో 349, పద్మనాభంలో 17 కుటుంబాలు ఈ ప్రయోజనం పొందనున్నాయి.

**సీఎం పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉదయం 10.30 గంటలకు విశాఖకు చేరుకుంటారు. ముందుగా ఆర్‌కే బీచ్‌లో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు, మత్స్యకారులతో ముచ్చటిస్తారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గొని, లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తారు. కార్యక్రమం ముగిసిన తర్వాత తిరిగి అమరావతికి ప్రయాణమవుతారు.

## సింహాచలం కళా వేదికపై నేడు, రేపు భక్తిరంజక సాంస్కృతిక కార్యక్రమాలు

**ఒకటి తరువాయి**

అనంతరం సాయంత్రం 5.00 గంటల నుంచి రాత్రి 7.00 గంటల వరకు శ్రీ వెంకటేశ్వర అన్నమాచార్య సేవా ట్రస్ట్ వారిచే 'కీర్తన కచేరీ' కార్యక్రమం కొనసాగుతుంది.సింహాచలం కళావేదికపై నిర్వహించనున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులు, కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని దేవస్థానం ఇఓ కోరారు

## పోలీసు సంక్షేమ ఆంగ్ల పాఠశాలలో కమ్యూనికేషన్ స్కిల్ టీచర్ ఉద్యోగం

**ఒకటి తరువాయి**

గంటల కువిజయనగరం కంటోన్మెంట్ పోలీసు క్వార్టర్సు సమీపంలోగల పోలీసు వెల్ఫేర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల నందు నిర్వహించే ఇంటర్వ్యూనకు సంబంధిత విద్యార్హత పత్రాలతో నేరుగా హాజరుకావచ్చునన్నారు. మరిన్ని వివరాల కొరకు మరియు సందేహాల నివృత్తి కోసం సంప్రదించవలసిన ఫోను నంబర్లు 6305883484 లేదా 9441022874 సంప్రదించ వచ్చునని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఏయూ దూరవిద్య ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

**ఆంధ్రవిశ్వవిద్యాలయం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** ఆంధ్రవిశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును అక్టోబర్ 13వ తేదీ వరకు పొడిగించినట్లు దూరవిద్య సంచాలకులు ఆచార్య డి.ఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ-డిఇబి సూచనలకు అనుగుణంగా ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్-ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ లెర్నింగ్ కోర్సులకు దరఖాస్తు గడువును పొడిగించారు. జూలై - ఆగస్టు 2026 సెషన్‌కు సంబంధించి ప్రవేశాలు పొందే విద్యార్థులు అక్టోబర్ 13 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓడిఎల్(ఆఫ్ లైన్) కోర్సుల ప్రవేశాలకు- www.andhrauniversity-sde.com ఆన్‌లైన్ కోర్సులకు- www.andhrauniversity.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## గర్భిణీలకు సామూహిక సీమంతాలు..!!

**ఆనందపురం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం ఎల్.వి.పాలెం సెక్టార్ కనమాం పంచాయతీ గోరింట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు పోషకాహార వంటల పోటీలు, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పి.వి.వి. రత్నం మాట్లాడుతూ 'మన అంగన్‌వాడీ--మన బాధ్యత' అనే భావనతో ప్రతి ఒక్కరూ పోషకాహారంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా



ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ముగ్గురు గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. కనమాం మహిళా సంరక్షణ కార్యదర్శి జామి సత్యవతి గర్భిణులకు చీరలను బహుమతిగా అందించారు. అనంతరం పోషకాహారంతో కూడిన వంటల పోటీలు నిర్వహించి, పోషక విలువలపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు స్వర్ణ, బేగం, దమయంతి, అంగన్‌వాడీ సహాయకురాలు, తల్లులు పాల్గొన్నారు.

## మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఘన స్వాగతం పలికిన కాణిపాకం బోర్డు సభ్యురాలు చల్లా కృష్ణవేణి

**దేవరాపల్లి , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాణిపాకం స్వయంభూ శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి దేవస్థానాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మంత్రికి కాణిపాకం దేవస్థానం బోర్డు సభ్యురాలు చల్లా కృష్ణవేణి ప్రత్యేకంగా పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికి ఆహ్వానించారు. ఆలయ మర్యాదలతో మంత్రిని స్వామివారి దర్శనానికి తీసుకెళ్లా



రు.అనంతరం మంత్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జగన్‌ది 'ఎల్‌నినో' బాధ కాదు

# పచ్చి 'అబద్ధాల నినో' డ్రామా : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**అమరావతి , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే వర్షాభావ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి, రైతులను, పంటలను కాపాడేందుకు కూటమి ప్రభుత్వం శాస్త్రీయ దృక్పథంతో సమగ్ర కార్యాచరణ చేపట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుంటే.. వాస్తవాలను పక్కనపెట్టి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం ఏమీ చేయలేదని జగన్ చెప్పడం పూర్తిగా అవాస్తవమని మంత్రి స్పష్టం చేశారు. ఎల్‌నినో ముప్పును ముందుగానే అంచనా వేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 2026లోనే 'జలధార' కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారని తెలిపారు. ముందస్తు ప్రణాళికలు, క్షేత్రస్థాయి చర్యల ఫలితంగానే రాష్ట్రంలో భూగర్భ జలాలు 0.79 మీటర్లు పెరిగాయని వెల్లడించారు. 'జలధార--జలహారతి' కార్యక్రమం కింద కూటమి ప్రభుత్వం రూ.3,409.35 కోట్ల వ్యయంతో 79,826 పనులను పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యల వల్ల రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 625 టీఎంసీల భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ముందస్తు చర్యలు లేకపోయి ఉంటే పరిస్థితి మరింత క్లిష్టంగా మారేదని పేర్కొన్నారు.

### గత ప్రభుత్వ బకాయిలను మేమే చెల్లిస్తున్నాం.. పంటల బీమాలో ఏపీ దేశంలోనే ముందంజ

పంటల బీమా గురించి మాట్లాడే నైతిక అర్హత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేదని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఖరీఫ్ సీజన్‌లో కేవలం మూడేళ్లు మాత్రమే పంటల బీమా ప్రీమియం చెల్లించి, రెండు సంవత్సరాలు ప్రీమియం చెల్లించకుండా వదిలేశారని, ఐదేళ్లలో రబీకి ఒక్క ఏడాది కూడా ఇన్సూరెన్స్ కట్టలేని జగన్ ఇప్పుడు నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఏర్పడిన ఆర్థిక భారాన్ని భరిస్తూనే రైతులకు పంటల బీమా భద్రత కల్పిస్తున్నామని చెప్పారు. పంటల బీమాను గాలికి వదిలేశామని విమర్శలు చేస్తున్న జగన్ ముందుగా తన ఐదేళ్ల పాలనలో రైతులకు ఏ మేరకు బీమా రక్షణ కల్పించారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. దేశంలోనే పంటల బీమా నమోదులో ఆంధ్రప్రదేశ్ అత్యధిక శాతం నమోదు సాధించిన రాష్ట్రంగా నిలిచిందని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బీమా ప్రీమియం నిధులను ముందుగానే ఎస్క్రో ఖాతాలో అందుబాటులో ఉంచామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ముందుచూపుతో తీసుకున్న చర్యల ఫలితంగా తొలిసారిగా సుమారు రూ.16 వేల కోట్ల విలువైన పంటలకు బీమా నమోదు జరిగిందని మంత్రి వెల్లడించారు. రైతులకు ప్రకృతి వైపరీత్యాల నుంచి ఆర్థిక భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, రైతు సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేస్తున్న తమ ప్రభుత్వాన్ని విమర్శించే ముందు వైసీపీ తన హయాంలో రైతులకు చేసిన అన్యాయానికి సమాధానం చెప్పాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

### ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు శాస్త్రీయంగా పంచసూత్రాల అమలు

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పరిస్థితిని ముందుగానే అంచనా వేసి ఫిబ్రవరి 2026 నుంచే కూటమి ప్రభుత్వం ముందస్తు కార్యాచరణను ప్రారంభించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. జూన్--ఆగస్టు కాలంలో సాధారణ వర్షపాతం 350 మి.మీ. కాగా ఇప్పటివరకు 170.9 మి.మీ. మాత్రమే నమోదైందని, రాష్ట్రంలో వర్షపాత లోటు 51.2 శాతంగా ఉండగా దేశవ్యాప్తంగా ఇది సుమారు 13 శాతమేనని వివరించారు. పంట నష్టం జరిగిన తర్వాత స్పందించే విధానానికి భిన్నంగా, శాస్త్రీయ సమాచారం, శాటిలైట్ పర్యవేక్షణ, జలాశయాల నీటి నిల్వలు, నేల తేమ, పంటల పరిస్థితి,



విత్తనాలు, సాగు పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ రైతు కేంద్రిత ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా ప్రాంతం--రైతు కమతం ఆధారిత వ్యూహం,, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక, 'రైతన్న మీ కోసం' ఎల్‌నినో మిటిగేషన్ ప్లాన్, పంటల బీమా ద్వారా ఆర్థిక రక్షణఅనే పంచసూత్రాలను అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని 8,489 రైతు సేవా కేంద్రాల పరిధిలో 1,357 గుర్తించి, , శాటిలైట్ సమాచారం, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా రైతు కమతాలను కేటగిరీలుగా విభజించి కమతం వారీగా ప్రత్యేక సలహాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. వర్షాధార ప్రాంతాల్లో పిఎండిఎస్ సీడ్ ను ప్రోత్సహిస్తూ సుమారు 23 లక్షల మంది రైతులు 25 లక్షల ఎకరాల్లో ఈ విధానాలను అనుసరిస్తున్నారని, పిఎండిఎస్ ను తో అనుసంధానించి పశుగ్రాస కొరతను నివారిస్తున్నామని తెలిపారు. జలాశయాలు, నదీ ప్రవాహాలు, సాగునీటి లభ్యతను అంచనా వేసి అధిక నీరు అవసరమయ్యే వరికి ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, స్వల్పకాలిక పంటలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆగస్టు 7, 2026న ప్రారంభించిన 'రైతన్న మీ కోసం' ద్వారా 46.86 లక్షల మంది రైతులకు సంబంధించిన 2.75 కోట్ల కమతాలను పరిశీలిస్తూ వ్యవసాయ, రెవెన్యూ, జలవనరులు తదితర శాఖల సమన్వయంతో ప్రతి కమతంలోని పంట, నీటి లభ్యత, నేల తేమ, పంట దశ, ప్రమాద స్థాయిని అంచనా వేసిఅందిస్తున్నామని తెలిపారు. అదే విధంగా పంటల బీమాను మరింత విస్తరించి 2025లో 19.5 లక్షలుగా ఉన్న బీమా దరఖాస్తులను 2026లో 35.15 లక్షలకు పెంచామని, బ్యాంకు రుణాలు తీసుకున్న కూడా బీమా పరిధిలోకి తీసుకురావడంతో వారి సంఖ్య 2 లక్షల నుంచి 27.5 లక్షలకు పెరిగిందని, ఉద్యానవన, పశు సంవర్ధక, మత్స్య, పట్టు తదితర అనుబంధ రంగాల్లోనూ నీటి పొదుపు, తేమ సంరక్షణ, పశుగ్రాసం, నీటి కొరత నివారణ, పంట--పశు రక్షణ చర్యలు చేపడుతున్నామని, గత ఏడాది 15,303గా ఉన్న అనిమల్ షెల్టర్ ను ఈ ఏడాది 20,000కు పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు.

### రాయలసీమను 'రతనాల సీమ'గా తీర్చిదిద్దుతాం.. రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్

వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ అభివృద్ధిపై కనీసం ఒక్క సమీక్ష సమావేశమైనా నిర్వహించారా అని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. వ్యవసాయాన్ని అత్యంత ప్రాధాన్య రంగంగా భావిస్తున్నందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నెలకు రెండుసార్లు వ్యవసాయ రంగంపై సమీక్షలు నిర్వహిస్తూ, రైతుల సమస్యలు, సాగునీరు, నీటి సంరక్షణ, పంటల పరిస్థితి, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధిపై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని 'వాటర్ మ్యాన్' అని ఊరికే అనలేదని, నీటి వనరుల సంరక్షణ, సమర్థ వినియోగానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యతే అందుకు నిదర్శనమన్నారు. వైసీపీ హయాంలో మైక్రో ఇరిగేషన్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో సుమారు రూ.1,100 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, వాటిని ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డ్రిప్, మైక్రో ఇరిగేషన్ విస్తరణకు పెద్దపీట వేసి, ఈ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపామని వెల్లడించారు. ప్రతి నీటి బొట్టును సమర్థవంతంగా వినియోగించుకోవడం, భూగర్భ జలాలను సంరక్షించడం, రైతులకు సాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాయలసీమకు తాగు, సాగునీరు అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేస్తున్న కృషిని మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శించకుండా ఉంటే సీమ ప్రజలు హర్షిస్తారని మంత్రి వ్యాఖ్యానించారు. రాయలసీమను 'రతనాల సీమ'గా తీర్చిదిద్దే లక్ష్యంతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ప్రభుత్వ పరిధిలో సుమారు రూ.40 వేల కోట్లు, ప్రైవేట్ రంగంలో మరో రూ.60 వేల కోట్ల పెట్టుబడులతో మొత్తం రూ.1 లక్ష కోట్ల మేర పెట్టుబడులను ఆకర్షించి హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయనున్నామని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. వ్యవసాయం, సాగునీరు, ఉద్యానవన రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేసి రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు రాయలసీమ ప్రాంత ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

### రైతుల కోసం ముందుగానే విత్తనాల సిద్ధం

వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు చేసిందని మంత్రి చెప్పారు. మొదటి విడతలో 47,321 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేయడంతో పాటు, ఆగస్టు 15 తర్వాత ఏర్పడే అదనపు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మరో 1.12 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచామని తెలిపారు. ఆగస్టు 3 నుంచే ఆర్ఎస్‌కేలు, మండల స్థాయిలో 'రైతన్నా మీకోసం' వారోత్సవాల ద్వారా ప్రత్యామ్నాయ పంటల సాగుపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అదేవిధంగా 6.30 లక్షల హెక్టార్లలో పి ఎం ఎఫ్ బి వై, ఆర్ డబ్ల్యు బి సి ఐ ఎస్ కింద పంటల బీమా కవరేజ్ కల్పించామని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వరి బీమా నమోదుకు గడువును ఆగస్టు 31 వరకు పొడిగించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఐదు నెలలకు సరిపడా పశుగ్రాసం అందుబాటులో ఉందని మంత్రి తెలిపారు. పశుగ్రాసం అధికంగా ఉన్న ప్రాంతాల నుంచి కొరత ఉన్న జిల్లాలకు తరలించేందుకు ఇప్పటికే స్పష్టమైన ట్రాన్స్‌పోర్ట్ ప్లాన్‌ను సిద్ధం చేశామని చెప్పారు. పశువులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందన్నారు.

### తెలంగాణ అక్రమ ప్రాజెక్టులపై జగన్ ఎందుకు మౌనం వహించారు?

వైసీపీ ఐదేళ్ల పాలనలో తెలంగాణ ప్రభుత్వం అక్రమ ప్రాజెక్టులు నిర్మిస్తున్న సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు మౌనం వహించారని మంత్రి అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాల్లో అప్పటి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని విమర్శించారు. రైతులు, వ్యవసాయం, నీటి వనరుల ప్రయోజనాలను కాపాడటంలో కూటమి ప్రభుత్వం నిరంతరం అప్రమత్తంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రకృతి విపత్తులు, వాతావరణ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు శాస్త్రీయ విధానాలను అనుసరిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రతి రైతును.. ప్రతి పంటను కాపాడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం రాత్రింబవళ్లు పనిచేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు

# ధారకొండ ధారాలమ్మను దర్శించుకున్న అటవీ రేంజ్ అధికారి

## అటవీ ప్రాంతాల పరిశీలన.. సిబ్బందికి రేంజ్ అధికారి సూచనలు



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధారకొండ ధారాలమ్మ అమ్మవారిని అటవీ శాఖ ఆర్వీనగర్ రేంజ్ అధికారి మణికృష్ణ, శిక్షణలో ఉన్న అటవీ సిబ్బంది శుక్రవారం దర్శించుకున్నారు. రాజమండ్రి అటవీ శాఖ పరిధిలో నూతనంగా విధుల్లోకి వచ్చిన బీట్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆర్వీ నగర్ రేంజ్ పరిధిలో అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ముందుగా ధారకొండలోని ధారాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకున్న అటవీ అధికారులు, సిబ్బంది అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో పర్యటించి అడవుల స్థితిగతులు, ప్రకృతి వనరులు, అటవీ సంరక్షణకు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శిక్షణలో భాగంగా అటవీ ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా బీట్ అధికారులకు విధులపై మరింత అవగాహన కలుగుతుందని అధికారులు తెలిపారు. అటవీ ప్రాంతాల పరిరక్షణ, అడవుల అభివృద్ధి, వన్యప్రాణుల సంరక్షణ, అక్రమ కలప తరలింపు నియంత్రణ వంటి అంశాలపై క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా వ్యవహరించాలని రేంజ్ అధికారి మణికృష్ణ సిబ్బందికి సూచించారు. విధి నిర్వహణలో స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, అటవీ సంపదకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అటవీ ప్రాంతాల్లో విధులు నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రజలతో సమన్వయం, అటవీ సంరక్షణలో బీట్ అధికారుల బాధ్యతలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పర్యటనలో అటవీ అధికారులు, శిక్షణ సిబ్బంది పాల్గొన్నారు. ధారకొండ ధారాలమ్మ దర్శనం అనంతరం అటవీ ప్రాంతాలను పరిశీలించడం ద్వారా శిక్షణ సిబ్బందికి ఆధ్యాత్మిక అనుభూతితో పాటు క్షేత్రస్థాయి విధులపై అవగాహన కలిగిందని అధికారులు పేర్కొన్నారు.

## కాశీపురం డ్రైనేజీ సమస్యను ఎమ్మెల్యే వరకు తీసుకెళ్లిన చిటిమిరెడ్డి సూర్యనారాయణ



**దేవరాపల్లి , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** మండలంలోని కాశీపురం గ్రామంలో డ్రైనేజీలు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపైకి వస్తున్న సమస్యను రావికమతం తెలుగుదేశం పార్టీ పరిశీలకులు, దేవరాపల్లి మండల పూర్వపు అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ బుధవారం గుర్తించి, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకెళ్లారు. సూర్యనారాయణ ఫిర్యాదుపై స్పందించిన ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ మంజులా వాణి గ్రామాన్ని సందర్శించి డ్రైనేజీ కాలువలను ప్రత్యక్షంగా పరిశీలించి, చెత్తను తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, మండల తహసీల్దార్ పి. లక్ష్మీదేవి, ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, ఆర్. డబ్ల్యూ. ఎస్ ఏఈ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి అనంత ఉమాదేవి సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జీకేవీధిలో ఘనంగా అన్న సమారాధన

### శ్రీ వరసిద్ధి సంపత్ వినాయక ఆలయంలో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** మండల కేంద్రంలోని శ్రీ వరసిద్ధి సంపత్ వినాయక ఆలయంలో గణేష్ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. అన్న సమారాధన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గూడెంకొత్తవీధి సీఐ సుధాకర్, ఎస్సై సురేష్ హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ అన్నాజీ రావు, ఎంపీడీవో రమణబాబు, వ్యవసాయ అధికారి సురేష్‌తో పాటు పలువురు మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్న సమారాధనకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి దర్శనం అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు క్రమపద్ధతిలో అన్న ప్రసాదాన్ని అందించారు. గణేష్ శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఏడాది సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని, భక్తుల సహకారంతో ఈ ఏడాది కూడా ఉత్సవాలను ఘనంగా కొనసాగిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పైల శ్రీనివాసరావు, స్వామి నరసింహచారి, సత్యనారాయణ, కిషోర్ తదితరులు పాల్గొని అన్న సమారాధన ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించడంతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

## పెన్షన్ ప్రక్రియను నిరంతరం కొనసాగించాలి

### కటాఫ్ తేదీలతో అర్హులైన లబ్ధిదారులకు నష్టం: మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు



**గూడెంకొత్తవీది , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** పెన్షన్ దరఖాస్తు ప్రక్రియను కటాఫ్ తేదీలకు పరిమితం చేయకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని మండల కార్యదర్శి అంపురంగి బుజ్జిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం 50 సంవత్సరాలు నిండిన లబ్ధిదారులకు కటాఫ్ తేదీలు విధించడంతో పాటు వివిధ ధ్రువపత్రాలు సమర్పించాలని అధికారులు సూచించడం వల్ల అర్హత ఉన్నప్పటికీ కొంతమంది సమయానికి దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. కటాఫ్ తేదీ నాటికి 50 సంవత్సరాలు నిండేందుకు కొన్ని రోజులు లేదా నెలలు మాత్రమే తక్కువగా ఉన్నవారికి కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడం వల్ల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అర్హత సాధించిన వెంటనే పెన్షన్‌కు దరఖాస్తు చేసుకునేలా నిరంతర ఆన్‌లైన్ దరఖాస్తు విధానాన్ని అమలు చేసి లబ్ధిదారులకు నష్టం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బుజ్జిబాబు కోరారు.

## పాల్తేరులో అలరించిన వినాయకుడి గరిక పూజ



**పాయకరావుపేట, సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** మండలంలోని పాల్తేరులో వినాయక నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం విశేష పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధానాలయంలో కొలువు దీరిన గణనాధునికి ఉదయం తొమ్మిది గంటలకు ప్రత్యేక అభిషేకం జరిపించారు.

భక్తులందరి సమక్షంలో గరిక పూజా కార్యక్రమా న్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, దంపతులు ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు.

# ప్రకృతి ఒడిలో సంపూర్ణ ఆరోగ్యం - ప్రహ్లాద యోగ ప్రకృతి

## చికిత్సాలయంలో వైద్య సేవల విస్తరణ : ఈవో జల్లేపల్లి వెంకట్రావు



**సింహాచలం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం పరిధిలోని కృష్ణాపురం గోశాలలో ఉన్న ప్రహ్లాద యోగ ప్రకృతి చికిత్సాలయంలో వైద్య సేవలను మరింత విస్తృతం చేయనున్నట్లు దేవస్థానంకార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు.ప్రహ్లాద యోగ ప్రకృతి చికిత్సాలయంలో వైద్య సిబ్బందితో సమావేశమైన ఈవో మాట్లాడుతూ భక్తులు, ప్రజల ఆరోగ్యమే పరమావధిగా భావించి ప్రకృతి ఆధారిత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి దేవస్థానం మరో అడుగు ముందుకు వేస్తోందన్నారు. కరోనా అనంతరం కొంతకాలంగా మందగించిన ప్రకృతి వైద్య సేవలను తిరిగి పునరుద్ధరించి, భక్తులు మరియు ప్రజలకు మరింత ప్రయోజనం కలిగేలా సేవలను విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ప్రకృతి ఒడిలో వైద్యం -- సహజ చికిత్సలతో సంపూర్ణ ఆరోగ్యం అనే లక్ష్యంతో ఈ చికిత్సాలయంలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని వినియోగించుకుని ప్రకృతి వైద్య విధానాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. పచ్చని చెట్లు, స్వచ్ఛమైన గాలి, పక్షుల కిలకిలారావాలతో ప్రశాంతమైన వాతావరణం, సేదతీరేందుకు అనువైన తోటలు, నడకకు అనుకూలంగా ఉన్న మట్టి రహదారులు ప్రకృతి చికిత్సకు ఎంతో అనుకూలంగా ఉంటాయని ఈవో తెలిపారు.ప్రకృతి వైద్య విధానంలో భాగంగా, అభ్యంగనం, స్నేహస్వేదనం, మడ్ బాత్, శిరోధార, తక్రధార, క్షీరధార, పత్రపోటలి, ఊర్ధ్వవర్తనం తదితర సహజ చికిత్సా విధానాలను అందించేందుకు ప్రహ్లాద యోగ ప్రకృతి చికిత్సాలయాన్ని సన్నద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.ప్రకృతి వైద్యం, యోగ, సహజ చికిత్సా విధానాల ద్వారా శారీరక, మానసిక ప్రశాంతతను పొందేందుకు అనుకూలమైన వాతావరణాన్ని భక్తులకు, ప్రజలకు అందించడమే దేవస్థానం లక్ష్యమని ఈవో జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు. ఇందుకు అవసరమైన వైద్య సిబ్బంది, చికిత్సా సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్:80086 72523 ప్రకృతి వైద్య సేవలను పొందదలచిన వారు పై ఫోన్ నంబర్‌లో సంప్రదించి చికిత్సా విధానాలు, అందుబాటులో ఉన్న సేవలు తదితర వివరాలను తెలుసుకోవచ్చని దేవస్థానం ఇఓ జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు.

# తాటిపర్తిలో కన్నుల పండువగా వినాయక నవరాత్రి దీపారాధన




**వి.మాడుగుల , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీలో వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభ మధ్య కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి స్థానిక శ్రీరాముల వారి ఆలయంలో భక్తులు మరియు గ్రామస్తులందరూ కలిసి ఘనంగా దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుక గ్రామంలో ప్రత్యేక పండుగ వాతావరణాన్ని తలపించింది. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ విఘ్నేశ్వర స్వామివారి ఆలయాన్ని, విగ్రహాన్ని రంగురంగుల పూలతో, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భక్తిశ్రద్ధలతో వేద మంత్రోచ్చారణలు మరియు భక్తి గీతాల నడుమ స్వామివారికి విశేష పూజలు, హారతులు సమర్పించారు. ఈ వేడుకలో భాగంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో మట్టి ప్రమిదల్లో దీపాలను వెలిగించారు. వందలాది దీపాల కాంతులతో శ్రీరాముల వారి ఆలయ ప్రాంగణం అంతా దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఈ అద్భుతమైన దృశ్యం చూసేవారికి కనులవిందుగా నిలిచింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో తాటిపర్తి గ్రామ మహిళలు మరియు చిన్నారులు ఎంతో ఉత్సాహంగా, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాంప్రదాయ వస్త్రధారణలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వనుగు రమణమ్మ, గరుతూరి వరలక్ష్మి, రమాకుమారి, సాయి లత, చిన్నమ్మ తదితర మహిళా భక్తులు మరియు స్థానిక చిన్నారులు పెద్ద సంఖ్యలో పాలుపంచుకుని స్వామివారి కృపను పొందారు. వినాయక నవరాత్రి సందర్భంగా నిర్వహించిన ఈ దీపారాధన కార్యక్రమం తాటిపర్తి గ్రామంలో భక్తి పారవశ్యాన్ని నింపింది. ప్రతి ఇంటి నుంచి భక్తులు తరలిరావడంతో గ్రామంలో ఒక పవిత్రమైన, ఐక్యతను చాటే వాతావరణం నెలకొందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు గ్రామంలోని ప్రతి ఒక్కరిని భక్తి మార్గంలో నడిపించాయి.

# సాఫ్ట్‌బాల్‌లో రేవంత్ ఉత్తమ ప్రతిభ..జాతీయ పోటీలకు ఎంపిక



**ఆనందపురం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** ఆనందపురం మండలం రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్. రేవంత్ సబ్‌జూనియర్స్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విజయనగరం జిల్లాలో ఈ నెల 11, 12, 13 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో రేవంత్ అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించినట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు మహారాష్ట్రలో ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు రేవంత్‌కు రామవరం గ్రామ సర్పంచి వై. పైడిరాజు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.జాతీయ స్థాయి పోటీల్లోనూ రేవంత్ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు బి. వరలక్ష్మి, ఎస్ఎంసీ చైర్మన్ ఎస్. రామచంద్రరావు, ఉపాధ్యాయ బృందం ఆకాంక్షించారు.

## చింతరేగుపల్లిలో ఘనంగా పోషణ మహోత్సవం

**వి.ఆర్.పురం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** పోలవరం జిల్లా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం కూనవరం ప్రాజెక్టు అధికారి శ్రీమతి వి. మల్లిక పర్యవేక్షణలో 9వ జాతీయ పోషణ మహోత్సవ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వి.ఆర్.పురం మండలం చిన్న మట్టపల్లి పంచాయతీ పరిధిలోని చింతరేగుపల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగ పర్యవేక్షకురాలు పద్మావతి మాట్లాడుతూ మునగాకును నిత్యం వంటకాలలో వినియోగించడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. మునగాకులో విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉండటంతో పాటు కాల్షియం, ఇనుము అధికంగా ఉంటాయని వివరించారు. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు ప్రతిరోజూ వైవిధ్యభరితమైన పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వేడిగా వండిన పౌష్టికాహారం అందించడం, పరిశుభ్రత పాటించడం, సమాజ భాగస్వామ్యంతో పోషకాహార లోపాన్ని నివారించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రధానమంత్రి మాతృ వందన పథకం ద్వారా గర్భిణీలు, బాలింతలకు అందించే సేవలు, తల్లి--బిడ్డల సంరక్షణ, సమతుల్య ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలను వివరించారు. ప్రతి కుటుంబం పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, గ్రామ పెద్దలు, కిశోర బాలికలు, యువజన కమిటీ సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది రంగమ్మ, కనకలక్ష్మి, సునీత, నాంచారమ్మ, లక్ష్మి, సరోజిని, అన్నపూర్ణ, అనూష, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాన్ని తనిఖీ..!



**ఆనందపురం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** మండలంలోని బోనిలోని హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రాన్ని నేషనల్ హెల్త్ సిస్టమ్ రిసోర్స్ సెంటర్ (ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీ) బృందం శుక్రవారం తనిఖీ చేసింది. బృంద సభ్యులు డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ రిషికేష్, ఎస్ఎస్ భాగ్యరేఖ కేంద్రంలోని వైద్య సేవలు, నిర్వహణ తీరును పరిశీలించారు. హెల్త్ అండ్ వెల్నెస్ కేంద్రంలో వైద్య సేవలను మరింత మెరుగుపరచేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన విధానాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్‌క్యూఏఎస్ ప్రమాణాలకు అనుగుణంగా ఏఏఎం, హెచ్‌డబ్ల్యూసీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, రికార్డులు, నివేదికలను పద్ధతిగా నిర్వహించడం, అవసరమైన వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడం వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సబీనా భాను, సీహెచ్‌ఓ జి. శ్రీనివాసరావు, హెల్త్ విజిటర్ టి. రోహిణి, హెచ్‌డబ్ల్యూసీ సిబ్బంది జస్వంత్, కల్పన, అరుణ, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెడికల్ టెక్నాలజి రంగంలో నూతన ఆవిష్కరణలకు మెడ్‌టెక్ జోన్ ఆదర్శం

## గీతం "బయోమెడ్ భారత"లో విశాఖ ఎంపి శ్రీభరత్




**భీమునిపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ):** వైద్య ఆరోగ్య రంగంలో ఉపకరణాల తయారీకి విశాఖలోని మెడ్‌టెక్ జోన్ ఆదర్శం అని ముఖ్యంగా ఇక్కడ ఏర్పాటైన 250కి పైగా వైద్య పరికరాల తయారీ కంపెనీలు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని విశాఖ పార్లమెంట్ సభ్యుడు, గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న "బయోమెడ్ భారత్ 2026" (బయోమెడికల్ డివైస్ ఇన్నోవేషన్ హ్యాకథాన్) ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరయ్యారు. వైద్య ఉపకరణాలను తయారు చేయడానికి ముఖ్యంగా నూతన ఆవిష్కరణలకు వివిధ విభాగాల మధ్య సమన్వయం అవసరమని ఆయన పేర్కొన్నారు. వైద్య రంగంలో అవసరాలను తెలుసుకుని ఇంజనీరింగ్ నైపుణ్యాలను జోడించి దేశానికి అవసరమైన వైద్య ఉపకరణాలను అందించాలని సూచించారు. ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని అలాగే పెట్టుబడి పెట్టడానికి పలు కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని తెలిపారు. యువత తమ ఆలోచనలను ప్రోటోటైప్‌లకే పరిమితం చేయకుండా లోతైన అవగాహనతో మెడ్‌టెక్ రంగంలో ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రోజెనిక్స్ లేబోరేటరీస్ మరియు ఆక్టాకెమ్ బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరక్టర్ ఎస్.వెంకటప్రసాద్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ వైద్య పరికరాల ఎగుమతులు 4.1 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయని ఇది మరింతగా వృద్ధి చెందుతుందన్నారు. మనిషి శరీర తత్వాన్ని బట్టి రాగాల ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించే పరికరాలు, కృత్రిమ మత్ర పిండాల వంటి అవయవాల తయారీలపై పలు కంపెనీలు అధ్యయనం చేస్తున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ప్రో-వైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫి.పప్పు తదితరులు పాల్గొన్నారు. హ్యాకథాన్ పోటీలో విజేతలకు మొత్తం రూ. 4.5 లక్షల బహుమతిని అందించారు.

# రూ. 6.3 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## సాయిరాం కాలనీ కళ్యాణ మండపాన్ని ప్రారంభించిన గంటా

**భీమునిపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ):** మధురవాడ జోన్ లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన.. ప్రారంభోత్సవాలు చేశారు. 7 వ వార్డు పరిధిలోని పాత పీఎం పాలెం, భరత్ నగర్, మల్లయ్య పాలెం, వాంబే కాలనీ, ఎన్.జి.ఓ. కాలనీ, చంద్రంపాలెం ప్రాంతాల్లో రూ. 6.10 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైయిన్లు, ప్రహరీలు.. 5 వ వార్డు పరదేశిపాలెంలో రూ.20 లక్షలతో డ్రెయిన్, కల్వర్టు నిర్మిస్తున్నామని వివరించారు. 5 వ వార్డు సాయిరాం కాలనీలో రూ. 88 లక్షలతో నిర్మించిన కళ్యాణ మండపాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మధురవాడ జోన్ లో రూ.200 కోట్ల అభివృద్ధి పనులకు చేపట్టామని.. రోడ్లు, డ్రైయిన్లు, కల్వర్టులు వంటి మౌలిక సౌకర్యాలకు పెద్ద పీట వేస్తున్నామని పేర్కొన్నారు. జోన్ లో 25 వేల ఇళ్లకు నిరంతర తాగు నీటి సరఫరా కోసం రూ. 725 కోట్లు వెచ్చించినట్టు తెలిపారు. జోనల్ కమిషనర్ వి.అయ్యప్ప నాయుడు, ఎస్.ఈ. శాంతి రాజు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, నాగోతి సత్యనారాయణ, మన్యాల సోంబాబు, మొల్లి లక్ష్మణరావు, పిల్లా వెంకట్రావు, కానూరు అచ్యుతరావు,



మొల్లి హేమలత, గరే గుర్నాథ్, లొడగల జానకిరామ్, పోలిశెట్టి నాగేశ్వరరావు, గడ్డి శ్రీను, నాగోతి వెంకట్రావు, నాయుడు, పోతిన శివ, బోయి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

**వినాయకుని దర్శించుకున్న గంటా**

చంద్రంపాలెంలో ఏర్పాటు చేసిన 45 అడుగుల వినాయక విగ్రహాన్ని గంటా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు తీసుకున్నారు.

# అర్జేడీ సదారావును సత్కరించిన ఎంప్యానల్డ్ అసోసియేషన్ ప్రతినిధులు



**విశాఖపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ):** సమాచార ,పౌర సంబంధాల శాఖలో పలు బాధ్యతలు నిర్వహించి కొంతకాలం కిందట ఉత్తరాంధ్ర జిల్లాల అర్జేడీగా పదోన్నతి పొందిన సదారావును ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం గురువారం ఘనంగా సత్కరించారు. పలు జిల్లాల నుండి విశాఖపట్నం పర్యటనకు వచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా పరిషత్ జంక్షన్ లో గల సమాచార శాఖ కార్యాలయంలో ఆయనను దుస్సాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. గతంలో విజయవాడ, పశ్చిమగోదావరి, నెల్లూరు , విశాఖపట్నంతో పాటు మన జిల్లాలో సమాచార శాఖ అధికారిగా ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఆయనకు జర్నలిస్టుల శ్రేయోభిలాషిగా రాష్ట్రమంతా గుర్తింపు ఉందని తెలిపారు .రాష్ట్ర ప్రభుత్వం ఎంప్యానల్డ్ దినపత్రికలతో పాటు ఇతర స్మాల్ పత్రికలకు తగిన చేయూతనిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదారావు మాట్లాడుతూ జర్నలిస్టులకు విశాఖ జిల్లాలో ప్రెస్ అక్రిడేషన్లు చాలావరకు మంజూరు చేస్తామని త్వరలో జరిగే డీఎంపిసి సమావేశంలో పెండింగ్ అక్రిడేషన్లన్నీ జారీ చేస్తామని పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ కు జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని జిల్లా కలెక్టర్ విడుదల చేసిన సి ఎస్ ఆర్ నిధుల నుండి ఈ ఏడాది సంబంధించి ఇప్పటికే అక్రి డేటెడ్ జర్నలిస్టులకు 130 మందికి చెల్లించామని మిగిలిన వారికి కూడా చెల్లింపుకు అవసరమైన మేరకు జిల్లా కలెక్టర్ నుండి నిధులు కోరుతామన్నారు. జర్నలిస్టుల సంబంధించిన అన్ని విషయాలపై తగతగిగతన స్పందిస్తున్నామని తెలిపారు. అసోసియేషన్ కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఎంప్యానల్డ్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సత్యనారాయణ, , ఉపాధ్యక్షుడు వల్లూరు ప్రసాద్ కుమార్, కార్యదర్శి మల్లెల శ్రీనివాసరావు ,కార్యవర్గ సభ్యురాలు బి.విజయ కుమారి, కె నాగమణి, ప్రసాద్, షేక్ గౌస్ బాషా, యు .రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గాజువాకలో మహిళపై హత్యాయత్నం..గుర్తుతెలియని వ్యక్తిపై కేసు నమోదు

**విశాఖపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ):** గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇందిరా కాలనీ, కనితి రోడ్‌లో శుక్రవారం మధ్యాహ్నం మహిళపై గుర్తుతెలియని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరా కాలనీకి చెందిన చెల్లిబోయిన కనక (58) తన ఇంటిలో ఉన్న సమయంలో, సుమారు మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో మాస్క్ ధరించిన గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. అనంతరం ఆమెను కదలకుండా అడ్డుకుని, నోటిని చేతితో మూసి, మరో చేతితో కత్తితో మెడపై దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిని ప్రతిఘటించే క్రమంలో బాధితురాలి కుడి అరచేతి, మెడ కుడివైపు మరియు కాలికి గాయాలైనట్లు తెలిపారు. ఘటన సమయంలో ఇంట్లో ఇతర కుటుంబ సభ్యులు ఎవరూ లేరని, వారు తిరుపతి దేవాలయాల సందర్శనకు వెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై చెల్లిబోయిన కనక ఇచ్చిన ఫిర్యాదు మేరకు గాజువాక పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం. 377/2026, సెక్షన్ 109(1) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేశారు. గుర్తుతెలియని నిందితుడిని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఘటనకు సంబంధించిన పరిస్థితులు, ఆధారాలు మరియు నిందితుడి ఆచూకీపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. కేసు దర్యాప్తును గాజువాక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చింతా వాసు నాయుడు గారి ఆధ్వర్యంలో ఎస్ రమణ గారు చేపట్టారు.

# తయారీ, ఆఫ్‌షోర్ పవన విద్యుత్, రీపవరింగ్ పై విండర్జీ ఇండియా 2026

**విశాఖపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** విండ్ భారత ఇంధన స్థితిస్థాపకతకు శక్తి' అనే ఇతివృత్తంతో విండర్జీ ఇండియా 2026 ఎనిమిదో ఎడిషన్ అక్టోబర్ 7 నుంచి 9 వరకు చెన్నై ట్రేడ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. దేశంలో పవన విద్యుత్ రంగం వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే 58 గిగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యాన్ని దాటిన ఈ రంగం.. 2030 నాటికి 100 గిగావాట్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా అడుగులు వేస్తోందన్నారు. స్వచ్ఛ ఇంధన ఉత్పత్తితో పాటు పారిశ్రామిక, ఎగుమతి రంగాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్న పవన విద్యుత్ రంగం సామర్థ్యాలను 'విండర్జీ ఇండియా 2026' ప్రదర్శించనుందని చెప్పారు. భారత్ ఇంధన మార్పిడి ప్రక్రియ కేవలం మెగావాట్ల సామర్థ్యాన్ని పెంచడానికే పరిమితం కాదు. నైపుణ్య ఉద్యోగాలను సృష్టించే, తయారీ రంగానికి ఊతమిచ్చే, ఎగుమతులను పెంచే, ఇంధన భద్రతను బలోపేతం చేసే సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది. దిగుమతి చేసుకునే, ధరల్లో తీవ్ర మార్పులకు లోనయ్యే శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా మొత్తం వ్యవస్థ వ్యయాన్ని కూడా తగ్గించవచ్చు" అని కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ (ఎంఎన్ఆర్ఈ) సంయుక్త కార్యదర్శి రాజేశ్ కుల్హరి తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో దేశంలో ఏకంగా 6.05 గిగావాట్ల పవన విద్యుత్ సామర్థ్యం కొత్తగా చేరింది. ఒక ఆర్థిక సంవత్సరంలో నమోదైన అత్యధిక వార్షిక సామర్థ్య పెరుగుదల ఇదే. దీంతో 2026 ఆగస్టు 31 నాటికి దేశంలో మొత్తం పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం 58.52 గిగావాట్లకు చేరిందన్నారు. 2030 నాటికి 100 గిగావాట్ల లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏటా సుమారు 10 గిగావాట్ల కొత్త సామర్థ్యాన్ని జోడించాల్సి ఉంటుంది. ప్రస్తుతం దాదాపు 43 గిగావాట్ల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉండటం ఈ లక్ష్య సాధనకు కీలకంగా మారనుందని చెప్పారు. దేశీయ పవన టర్బైన్ తయారీ సామర్థ్యం 2014లో ఏడాదికి 10 గిగావాట్లుగా ఉండగా.. ప్రస్తుతం 24 గిగావాట్లకు చేరింది. దేశీయంగా తయారయ్యే ఉత్పత్తుల్లో విలువ జోడింపు 70--80 శాతంగా ఉన్నట్లు అంచనా ఉందని తెలిపారు. ఎంఎన్ఆర్ఈ ఇండియన్ విండ్ టర్బైన్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐడబ్ల్యూటీఎంఏ)తో కలిసి దేశంలో తొలి పవన విద్యుత్ సరఫరా గొలుసు పోర్టల్ 'డబ్ల్యూటీ మారుట్ ను ప్రారంభించిందని ఐడబ్ల్యూటీఎంఏ వైస్ ఛైర్మన్, కార్యదర్శి డాక్టర్ శరవణన్ మణిక్కం తెలిపారు. 'పవన విద్యుత్ రంగం తొలినాళ్లలోని చిన్న పరిశ్రమ స్థాయి నుంచి 58 గిగావాట్లకు పైగా స్థాపిత సామర్థ్యం కలిగిన రంగంగా ఎదిగింది. ప్రస్తుతం మన దేశంలో తయారైన టర్బైన్లు ప్రపంచ మార్కెట్లకు ఎగుమతవుతున్నాయి. ఇక ముందున్న లక్ష్యాలు స్పష్టంగా ఉన్నాయి. 2030 నాటికి 100 గిగావాట్లు, 2035 నాటికి 155 గిగావాట్ల సామర్థ్యాన్ని చేరుకోవాలి. ఈ లక్ష్యాల కోసం తయారీదారులు, ప్రాజెక్టు అభివృద్ధిదారులు, విధాన నిర్ణేతలు, సాంకేతిక ఆవిష్కర్తలు కలిసి పనిచేయాలి" అని ఐడబ్ల్యూటీఎంఏ కార్యదర్శి, సుజ్లాన్ ఎనర్జీ లిమిటెడ్ కార్పొరేట్ అఫైర్స్ అండ్ రిటైల్ బిజినెస్ అధ్యక్షుడు దినేశ్ జగ్దాలే తెలిపారు.

# ఆర్. మాధవన్ ప్రచారకర్తగా 'నథింగ్ స్మాల్ అబౌట్ అజ్' ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించిన ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు




**విశాఖపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** దేశవ్యాప్తంగా 26 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలవ్యాప్తంగా 800 పైగా శాఖలతో 1 కోటికి పైగా కస్టమర్లకు సేవలు అందిస్తున్న ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ (ఉజ్జీవన్ ఎస్ఎఫ్‌బీ), తమ ప్రచారకర్తగా వ్యవహరిస్తున్న ప్రముఖ నటుడు మరియు పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆర్ మాధవన్‌తో 'నథింగ్ స్మాల్ అబౌట్ అజ్' పేరిట సరికొత్త బ్రాండ్ ప్రచార కార్యక్రమాన్ని ఆవిష్కరించింది. కస్టమర్ల కీలక అభిప్రాయాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఇది రూపొందించబడింది. సాధారణంగా 'స్మాల్' (చిన్న) అంటే బ్యాంకు ప్రధానంగా చిన్న చిన్న ఆర్థిక అవసరాలకు మాత్రమే సరిపోయే సేవలందిస్తుందని, పరిమిత స్థాయిలోనే బ్యాంకింగ్ ఉత్పత్తులు ఉంటాయేమోనని, తక్కువ స్థాయిలోనే కార్యకలాపాలు ఉంటాయేమోననే అభిప్రాయాన్ని కలిగించవచ్చు. 'నథింగ్ స్మాల్ అబౌట్ అజ్' అనే ప్రచార కార్యక్రమం ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ యొక్క విస్తృత కార్యకలాపాల స్థాయిని తెలియజేస్తూ, ఈ అభిప్రాయాలను తొలగించే విధంగా ఉంటుంది. సేవింగ్స్, డిపాజిట్లు, బిజినెస్ బ్యాంకింగ్, ఫారెక్స్ మరియు ఎన్నారై సర్వీసులతో పాటు ఇన్వెస్ట్‌మెంట్ మరియు వెల్త్ సొల్యూషన్స్‌వ్యాప్తంగా ఉజ్జీవన్ విస్తృత స్థాయిలో, సమగ్రమైన బ్యాంకింగ్ సొల్యూషన్స్ శ్రేణిని అందిస్తోంది. వివిధ వర్గాల ఆర్థిక అవసరాలకు అనుగుణంగా రూ. 6,000 నుంచి రూ. 250 కోట్ల వరకు రుణ సాధనాలను అందిస్తోంది. "ఈ 'నథింగ్ స్మాల్ అబౌట్ అజ్' అనేది కస్టమర్లలో నెలకొన్న వాస్తవిక అభిప్రాయం నుంచి పుట్టుకొచ్చింది. 'స్మాల్' అంటే మేము అందించే సొల్యూషన్స్, పరిమాణం లేదా మా కార్యకలాపాల స్థాయి పరిమితంగానే ఉంటాయనే అభిప్రాయానికి దారి తీయొచ్చని మేము గుర్తించాం. నేటి ఉజ్జీవన్ స్థాయి అనేది ఆ అభిప్రాయానికి పూర్తి భిన్నంగా ఉంటుంది. కస్టమర్ల వివిధ రకాల అవసరాలను తీర్చేలా విస్తృత బ్రాంచ్ నెట్‌వర్క్, బ్యాంకింగ్ మరియు రుణాలకు సంబంధించి సమగ్ర శ్రేణిని కలిగి ఉంది. ఈ ప్రచార కార్యక్రమం ద్వారా వైవిధ్యమైన ఆర్థిక అవసరాలను తీర్చేలా విస్తృత స్థాయి గల బ్యాంకుగా నేటి ఉజ్జీవన్ స్థాయిని అందరూ గుర్తించేలా చేయాలనేది మా ఉద్దేశం. అనేక ఏళ్లుగా విశ్వసనీయతకు, నమ్మకాన్ని పెంపొందించుకున్న ఆర్ మాధవన్ సహజంగానే ఈ సందేశాన్ని అందరికీ చేరవేయగలరు" అని ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ వేలాయుధం తెలిపారు. "నేను ఏ బ్రాండుతోనైనా జట్టు కట్టినప్పుడు ముందుగా దాన్ని అర్థం చేసుకోవడానికి ప్రాధాన్యమిస్తాను. ఉజ్జీవన్ విషయంలో కూడా నేను ముందుగా స్వంతంగా అధ్యయనం చేశాను. బ్యాంకు గురించి, దాని ప్రస్థానం గురించి, అనేక సంవత్సరాలుగా అది ఎదిగిన తీరు గురించి తెలుసుకున్నాను. నేను తెలుసుకున్న విషయాలు చాలా సంతృప్తిని, అలాగే ఉజ్జీవన్‌తో చేతులు కలిపేందు కు నమ్మకాన్ని కలిగించాయి. అని పద్మశ్రీ పురస్కార గ్రహీత ఆర్. మాధవన్ తెలిపారు.

# బంధవీధి గ్రామంలో సాసా కార్యక్రమం నిర్వహించనున్న జిల్లా కలెక్టర్

## గ్రామస్థాయి సమస్యల పరిష్కారానికి ప్రజలతో నేరుగా సమావేశం



**పాడేరు , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ శ్రీమతి టి. నిశాంతి, ఐఏఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19, 2026న బంధవీధి గ్రామం, కె.కొడవల్లి సచివాలయ పరిధిలో సాసా కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమం అనంతరం గ్రామస్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పి జి ఆర్ ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల నుంచి నేరుగా సమస్యలు, వినతులు స్వీకరించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నారు. గ్రామస్థాయి ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కార చర్యలు చేపట్టడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్ర మాల అమలును సమీక్షించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా ఉంది. కార్యక్రమానికి సంబంధిత అన్ని జిల్లా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై, తమ శాఖలకు సంబం ధించిన అంశాలపై అవసరమైన సమాచారం, వివరాలతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలు, వినతులను గ్రామస్థాయి కేజీ ఆర్ఎస్ లో నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి అవకాశం వినియోగించుకోవాలని జిల్లా యంత్రాంగం కోరింది.

# మెట్లపై నుంచి జారిపడి కేరళకు చెందిన వ్యక్తి మృతి



**గాజువాక , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజీవనగర్ కాలనీలో కొళ్లాయి నీటి కోసం కిందకు దిగి, తిరిగి పైకి ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. మృతుడు లిక్కోలం జిల్లా, కేరళ రాష్ట్రానికి చెందిన తాడా విజయ్ (60)లిగా ప్రాథమికంగా గుర్తించారు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని బంధువులు ఇంకా పోలీసులకు అందుబాటులోకి రాలేదు. బంధువుల ఆచూకీ కోసం పోలీసులు చర్యలు చేపడుతున్నారు. బంధువులు అందుబాటులోకి వచ్చిన అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఎస్ఆర్ జిల్లా సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై ఉన్నతస్థాయి సంప్రదింపులు

## నీతిఆయోగ్, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, ఐఐఎం విశాఖపట్నం, జిల్లా యంత్రాంగం భాగస్వామ్యంతో కార్యాచరణ ప్రణాళికపై చర్చ

**పాడేరు , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** అల్లూరి సీతారామరాజు జిల్లాను స్థానిక వనరులు, అవసరాలు, భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా సుస్థిర అభివృద్ధికి ఒక నమూనా జిల్లాగా తీర్చిదిద్దే దిశగా సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు ఉన్నతస్థాయి సంప్రదింపులు జరిగాయి.ఇందులో భాగంగా సెప్టెంబర్ 17, 2026న నిర్వహించిన సమావేశంలో జిల్లా అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, నీతిఆయోగ్ సభ్యులు డాక్టర్ బాలసుబ్రహ్మణియన్, వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలకు చెందిన సీనియర్ అధికారులు, జిల్లా అధికారులు, ఐఐఎం విశాఖపట్నం ప్రతినిధులు పాల్గొన్నారు. నీతిఆయోగ్ సహకారంతో ఐఐఎం విశాఖపట్నం నిర్వహించిన అధ్యయనంలో పొందుపరిచిన సిఫార్సులు, జిల్లాలో వాటిని ఆచరణాత్మకంగా అమలు చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు.జిల్లాలోని అభివృద్ధి అవసరాలు, అందుబాటులో ఉన్న అవకాశాలు, సుస్థిర అభివృద్ధికి ఎదురయ్యే సవాళ్లు, వాటికి అనుసరించాల్సిన పరిష్కార మార్గాలను అధ్యయనం గుర్తించింది.జిల్లా ప్రత్యేకతలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక గిరిజన జనాభా అధికంగా ఉండటం, తూర్పు కనుమల సంక్లిష్ట భౌగోళిక పరిస్థితులు, విస్తరించి ఉన్న నివాస ప్రాంతాలు, పర్యావరణ సున్నితత్వం వంటి అంశాల నేపథ్యంలో ఏఎస్ఆర్ జిల్లాకు ప్రాంత ఆధారిత, ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక అవసరమని అధ్యయనంలో గుర్తించారు. జిల్లా భౌగోళిక పరిస్థితుల కారణంగా మౌలిక సదుపాయాలు, మార్కెట్ అనుసంధానం, ప్రభుత్వ సేవలు, ఆర్థిక అవకాశాలను ప్రజలకు చేరవేయడంలో ప్రత్యేక సవాళ్లు ఉన్నాయని అధ్యయనం పేర్కొంది.మైదాన, పట్టణ ప్రాంతాల్లో అనుసరిస్తున్న సాధారణ అభివృద్ధి నమూనాలను యథాతథంగా ఏఎస్ఆర్ వంటి కొండ, గిరిజన ప్రాంతంలో అమలు చేయడం కంటే, జిల్లా సహజ, వ్యవసాయ, అటవీ, సాంస్కృతిక వనరులకు అనుగుణంగా ప్రత్యేక అభివృద్ధి నమూనా రూపొందించాల్సిన అవసరాన్ని అధ్యయనం సూచించింది.రవాణా సౌకర్యాలు, విలువ ఆధారిత కార్యకలాపాలు, మానవ వనరుల అభివృద్ధి, పెట్టుబడులు, ఆరోగ్య సేవల ప్రాప్యత, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం వంటి అంశాలను జిల్లా అభివృద్ధిలో కీలక అంశాలుగా అధ్యయనం గుర్తించింది."గ్రోత్ హబ్--అండ్--స్పోక్" నమూనాపై చర్చ జిల్లా అభివృద్ధిలో మౌలిక సదుపాయాలు, సేవలు, ఆర్థిక కార్యకలాపాలను సమన్వయంతో అందించేందుకు గ్రోత్ హబ్--అండ్--స్పోక్ నమూనాను అమలు చేసే అంశంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.ఈ నమూనాలో ప్రాథమిక అభివృద్ధి కేంద్రాలు: డివిజన్ స్థాయిలో ఆర్థిక, సేవా కేంద్రాలు; ద్వితీయ అభివృద్ధి కేంద్రాలు: మండల, క్లస్టర్ స్థాయిలో అభివృద్ధి మరియు సేవా కేంద్రాలు; మారుమూల ఆవాసాల అనుసంధానం: చివరి మైలు వరకు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, సేవలు, మార్కెట్ అవకాశాలు చేరేలా భౌతిక మరియు డిజిటల్ అనుసంధానం. అధ్యయనంలో పాడేరు, రంపచోడవరం, చింతూరు ప్రాంతాలను ప్రాథమిక అభివృద్ధి కేంద్రాలుగా అభివృద్ధి చేసే అవకాశాన్ని ప్రతిపాదించినట్లు సమావేశంలో చర్చించారు.అభివృద్ధి కార్యక్రమాలను అక్కడక్కడ విడివిడిగా అమలు చేయడం కంటే, ప్రాంతాల పరస్పర అనుసంధానం, వనరుల సమర్థ వినియోగం, సేవల సమగ్ర పంపిణీకి ప్రాధాన్యతనిస్తూ సమన్వయంతో కూడిన ప్రణాళిక అవసరమని చర్చించారు.వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడింపుపై దృష్టి ఏఎస్ఆర్ జిల్లా ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్‌లో కేవలం ఉత్పత్తి పెంపుపైనే



కాకుండా వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించడం, రైతుల ఆదాయ అవకాశాలను విస్తరించడంపై దృష్టి సారించాలని అధ్యయనం సూచించింది.ఈ మేరకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు పంట అనంతర మౌలిక సదుపాయాలు, శుద్ధి, నిల్వ, శీతల గిడ్డంగులు, నాణ్యత ప్రమాణాలు, మార్కెట్ అనుసంధానం, ప్రాసెసింగ్ మరియు బ్రాండింగ్ వంటి అంశాలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని చర్చించారు.వ్యవసాయంతో పాటు స్థానిక వ్యాపారాలు, విలువ జోడింపు కార్యకలాపాలు జిల్లా ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషించేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు.అటవీ ఉత్పత్తులు -- విలువ జోడింపుతో స్థానిక ఆర్థిక వ్యవస్థ బలోపేతం జిల్లాలోని అటవీ ఆధారిత ఆర్థిక వ్యవస్థలో కలపేతర అటవీ ఉత్పత్తుల విలువ జోడింపుకు ప్రాధాన్యత ఇవ్వాలని అధ్యయనం సూచించింది.కేవలం ముడి అటవీ ఉత్పత్తుల సేకరణకు పరిమితం కాకుండా, సేకరించిన ఉత్పత్తులకు ప్రాథమిక శుద్ధి, గ్రేడింగ్, ప్రాసెసింగ్, మెరుగైన ధర నిర్ణయం, ప్యాకేజింగ్, బ్రాండింగ్ వంటి విలువ జోడింపు ప్రక్రియలను స్థానికంగా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని చర్చించారు.ఈ దిశగా జీసీసీ సేకరణ కేంద్రాల వికేంద్రీకరణ, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, సహకార సంస్థలు, స్థానిక వ్యాపార సంస్థలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా గిరిజనులకు అధిక ఆర్థిక ప్రయోజనం చేరే అవకాశాలను పరిశీలించారు. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి -- స్థానిక ఉపాధి అవకాశాల అనుసంధానంగిరిజన యువతకు స్థానికంగా అందుబాటులో ఉన్న ఆర్థిక అవకాశాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అనుసంధానం చేయాలని అధ్యయనం సూచించింది.ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్య, వృత్తి విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి మధ్య ఉన్న అనుసంధానాన్ని బలోపేతం చేయడానికి చర్యలు తీసుకోవాలని చర్చించారు. ప్రత్యేకంగా కాఫీ మరియు ఫుడ్ ప్రాసెసింగ్,విలువ జోడింపు, పర్యావరణహిత పర్యాటకం, డిజిటల్ సేవలు, పునరుత్పాదక శక్తి, ఆధునిక వ్యవసాయ పద్ధతులు వంటి రంగాల్లో స్థానిక నైపుణ్యాలను అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలతో అనుసంధానం చేసే అంశాన్ని పరిశీలించారు.17 వికసిత్ పంచాయతీలను నమూనా అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రతిపాదన గ్రామీణ స్థాయిలో సమగ్ర అభివృద్ధి ప్రణాళికను అమలు చేసేందుకు వికసిత్ పంచాయతీ విధానంను ముందుకు తీసుకెళ్లే అంశంపై సమావేశంలో చర్చించారు.ఇందులో భాగంగా గుర్తించిన 17 పంచాయతీలను మోడల్ పంచాయతీలుగా అభివృద్ధి చేసి, భాగస్వామ్య ప్రణాళిక, ప్రభుత్వ పథకాల సమన్వయం, జీవనోపాధులు, డిజిటల్ పాలన తదితర అంశాల్లో నమూనా విధానాలను అభివృద్ధి చేసి, వాటి అనుభవాలను జిల్లా వ్యాప్తంగా విస్తరించే అవకాశాన్ని పరిశీలించారు.రవాణా, ఆరోగ్య సేవల్లో ఫలితాల ఆధారిత విధానం కనెక్టివిటీని కేవలం రహదారుల నిర్మాణంతో కాకుండా ప్రయాణ సమయం తగ్గడం, నమ్మకమైన రవాణా, సరుకు రవాణా ఖర్చుల తగ్గింపు, మార్కెట్ సౌకర్యాల ప్రాప్యత వంటి ఫలితాల ఆధారంగా అంచనా వేయాలని చర్చించారు.ఆరోగ్య రంగంలో ప్రాథమిక ఆరోగ్య సేవలు, మొబైల్ వైద్య సేవలు, టెలిమెడిసిన్, రిఫరల్ వ్యవస్థలను అనుసంధానిస్తూ హబ్--అండ్--స్పోక్ విధానం ద్వారా మారుమూల ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే అంశాన్ని పరిశీలించారు.పర్యాటక రంగంలో స్థానిక ఆర్థిక ప్రయోజనాలకు ప్రాధాన్యత పర్యాటక రంగ అభివృద్ధిలో కేవలం సందర్శకుల సంఖ్యను మాత్రమే కాకుండా సందర్శకులు జిల్లాలో గడిపే రోజులు, స్థానిక వ్యయం, స్థానిక ఉపాధి, స్థానిక సంస్థల టర్నోవర్ వంటి సూచికలను పరిగణనలోకి తీసుకోవాలని చర్చించారు.పర్యాటకం ద్వారా వచ్చే ఆర్థిక ప్రయోజనాల్లో స్థానిక ప్రజలు, స్థానిక సంస్థల భాగస్వామ్యాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టే అంశాన్ని పరిశీలించారు.శాఖల మధ్య సమన్వయం -- డిజిటల్ పర్యవేక్షణజిల్లా అభివృద్ధి కార్యక్రమాలను సమగ్రంగా అమలు చేయడానికి వివిధ ప్రభుత్వ శాఖల మధ్య బలమైన సమన్వయం అవసరమని సమావేశంలో చర్చించారు.అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేందుకు యూనిఫైడ్ కంట్రోల్ కమాండ్ సెంటర్, లైవ్ డిజిటల్ డ్యాష్‌బోర్డ్ వంటి వ్యవస్థలను పరిశీలించే అంశం కూడా చర్చకు వచ్చింది.నీతిఆయోగ్ సహకారానికి గుర్తించిన ఐదు ప్రధాన అంశాలు జిల్లా అభివృద్ధి వ్యూహాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు నీతిఆయోగ్ సహాయ సహకారాలతో పరిశీలించదగిన ఐదు ప్రధాన అంశాలను సమావేశంలో గుర్తించారు:

**సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన;**

పాడేరు కేంద్రంగా పైలట్ గ్రోత్ హబ్-అండ్--స్పోక్ వ్యవస్థ అభివృద్ధి.. వికసిత్ పంచాయతీ విధానానికి ప్రమాణాలు, నమూనాల అభివృద్ధి;విలువ గొలుసులు, పర్యాటకం, వాణిజ్యం, సంస్థల అభివృద్ధి, నైపుణ్య అవసరాలపై సాంకేతిక అధ్యయనాలకు సహకారం; కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, నీతిఆయోగ్, ఐఐఎం విశాఖపట్నం మరియు సి ఎస్ ఆర్ భాగస్వాములతో సమన్వయ వేదిక ఏర్పాటు చేయడంలో సహకారం.తదుపరి కార్యాచరణ సంప్రదింపుల సమావేశంలో చర్చించిన అంశాల ఆధారంగా, జిల్లా అవసరాలు, స్థానిక వనరులు, భౌగోళిక పరిస్థితులు మరియు అభివృద్ధి ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యాచరణ మార్గపటాన్ని రూపొందించే దిశగా తదుపరి చర్యలు చేపట్టనున్నారు. జిల్లా యంత్రాంగం, నీతిఆయోగ్, ఐఐఎం విశాఖపట్నం, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు మరియు ఇతర భాగస్వామ్య సంస్థల సమన్వయంతో ప్రతిపాదిత అంశాలపై మరింత సాంకేతిక పరిశీలన చేపట్టనున్నారు.ఈ ప్రక్రియలో ఏయే రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి, ఏ శాఖ ఏ బాధ్యత చేపట్టాలి, అవసరమైన వనరులు ఏమిటి, శాఖల మధ్య ఏ విధమైన సమన్వయం అవసరం, సాధించాల్సిన ఫలితాలను ఏ విధంగా కొలవాలి అనే అంశాలను స్పష్టంగా రూపొందించి కార్యాచరణలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టనున్నారు.నీతిఆయోగ్, ఐఐఎం విశాఖపట్నం, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు మరియు ఇతర భాగస్వామ్య సంస్థలతో జరుగుతున్న ఈ సంప్రదింపులు, ఏఎస్ఆర్ జిల్లా సహజ, వ్యవసాయ, అటవీ మరియు సాంస్కృతిక వనరులను సుస్థిర జీవనోపాధులు, మెరుగైన కుటుంబ ఆదాయాలు, మెరుగైన ప్రజా సేవలు మరియు స్థానిక ఆర్థిక విలువ సృష్టికి అనుసంధానం చేసే సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు దోహదపడనున్నాయి.

# విశాఖ 66వ వార్డులో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛంద



**విశాఖపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం 66 వార్డులో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం అజిమాబాద్ లో జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి 66 వార్డు మాజీ కార్పొరేటర్ వార్డు ఇంచార్జ్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ అందరూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి మూడో శుక్రవారం అలాగే మూడో శనివారం నాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్రమంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజల్లో అవగాహన తీసుకురావాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో శుభ్రత పరిశుభ్రతపై ప్రతి ఒక్క మనిషికి అవగాహన చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలియజేశారు మలేరియా డెంగ్యూ క్యాన్సర్ వ్యాధుల నుండి ప్రజలను కాపాడుకోవాలని ప్లాస్టిక్ ని పూర్తిగా నిర్మించాలని ప్లాస్టిక్ రహిత గాజువాకగా చేయాలని చెప్పారు ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గోమాడ వాసు క్లస్టర్ ఇంచార్జ్ గూడెపు సత్యనారాయణ సీనియర్ మైనార్టీ నాయకులు ఆన్సర్ వల్లి స్వర్ణపుడి సత్యనారాయణ గణేష్ రెడ్డి హాపీజ అన్వర్ భాష హలీం మరియు సానిటరీ ఎస్ఎస్ కోటేశ్వరరావు గారు 66 వార్డ్ సానిటరీ ఇన్స్పెక్టర్ దివ్య మరియు ఏ ఎం ఓ సత్యనారాయణ మలేరియా ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ సచివాలయ సిబ్బంది పిల్లి భవాని సౌజన్య నవ్య వంశీ రమణ సానిటరీ మేస్త్రి రామారావు లక్ష్మణరావు రమాకాంత్ శ్రీహరి రామచంద్ర అప్పలరాజు మరియు మలేరియా అధికారులు సిబ్బంది ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు స్థానిక ప్రజలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత : సీఐ దివాకర్ యాదవ్

**భీమునిపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని భవిష్యత్ తరాలకు మంచి గాలి,నీరు వాతావరణం అందించాలని భీమిలి పోలీస్ సిఐ దివాకర్ యాదవ్ అన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిధిలోని కొత్తవలస పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో అతిధిగా హాజరై మొక్కలు నాటారు. కీ.శే.ఏ.సింహాచలం వర్ధంతి సందర్బంగా వారి కుటుంబ సభ్యులు గ్రామీణ వైద్యులు (ఆర్ ఎమ్ పి )వరలక్ష్మి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మాతృభూమి సేవ సంఘం గ్రామస్తులు, ఉపాధ్యాయుల సమక్షంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా సీఐ దివాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల రక్షణ పోలీసులు ప్రభుత్వాలు చుస్తే పర్యావరణ పరిరక్షణ బాధ్యత పౌరులు అందరిదన్నారు. మాతృభూమి సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకు రక్షణగా ఉంటూ ప్రధమ చికిత్స చేస్తూ తను జీవించడమే కాకుండా పరిసర ప్రాంత ప్రజలు ఆరోగ్యం అవసరం కోసం పర్యావరణ పరిరక్షణ చేయడం కూడ గ్రామీణ వైద్యులు బాధ్యతని అర్ ఎమ్ పి వైద్యులు వరలక్ష్మి ఈ కార్యక్రమం చేయడం



అభినందనీయమన్నారు. ఈ సందర్బంగా వరలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్తులో మాతృభూమి సేవ సంఘం మరియు మహిళ సంఘాలు సహకారంతో ఈ ప్రాంతంలో మరెన్నో సేవ కార్యక్రమాలు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసరావు,గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ ఉపాధ్యాయులు గంగాధర్,అరుణదేవి, సంఘం సభ్యులు రవ్వా వెంకటేష్ మహిళ సంఘం సభ్యులు భాగం లక్ష్మి తదితరులు పాల్గున్నారు.

# పాల్తేరులో ఉచిత క్యాన్సర్ పరీక్షలు




**పాయకరావుపేట , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా, అగనంపూడి హోమి బాబా క్యాన్సర్ హాస్పిటల్ బృందం శుక్రవారం మండలంలోని పాల్తేరులో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. స్త్రీలలో కనిపించే ముందస్తు లక్షణాలు ఆధారంగా నోటి, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేసారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ జీవన్ పర్యవేక్షణలో మహిళలకు ఉచితంగా ఈ వైద్య పరీక్షలు నిర్వహించారు. మెరుగైన వైద్య సేవలు అవసరమైన వారిని అగనంపూడి క్యాన్సర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరాంపురం పిహెచ్ సి సెకండ్ హెల్త్ అసిస్టెంట్ తులసి నవీన రాజ్యలక్ష్మి మాట్లాడుతూ... ప్రధాన మంత్రి స్వచ్ఛ సంకల్ప అభియాన్ క్యాన్సర్ ప్రోగ్రాంలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. షుగర్, బిపి వంటి సమస్యలు ఉన్నవారిని పిహెచ్ సికి రిఫర్ చేస్తామని, క్యాన్సర్ సంబంధించిన లక్షణాలు ఉంటే అగనంపూడి హోమి బాబా లేదా కేజీహెచ్ లకు పంపించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరానికి సంబంధించిన ఏర్పాట్లను, భోజన సదుపాయాలను దేవవరపు లోపరాజు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా హై కోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు సమకూర్చారు. ఈ వైద్య శిబిరంలో మన ఊరు-మన బాధ్యత యువ కమిటీ సభ్యులు సేవలందించారు.

# నిత్య అన్నదాన కార్యక్రమ గోడ పత్రిక ఆవిష్కరణ



**భీమునిపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** భీమిలి శ్రీ వీరాంజనేయ అయ్యప్ప స్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో తేదీ.10.11.2026 నుండి 24.12.2026 వరకు 45 రోజులు నిత్య అన్నదాన కార్యక్రమ నిర్వహణ యొక్క గోడ పత్రిక ను మరియు కరపత్రంలను స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోరపల్లి సన్యాసిరావు, పీఠం గురుస్వామి వేణు, గౌరవ అధ్యక్షులు కొమ్మినేని ఎరునాయుడు, సెక్రటరీ నెక్కిళ్ళ వెంకట్రావు, కోశాధికారి గాడు ఆనంద్, వర్కింగ్ ప్రెసిడెంట్ పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ దారపు అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్. కొండబాబు, జి.సత్యనారాయణ, వై. వెంకట్రావు, ఎన్. రాము, ముత్యాల రావు మరియు హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు, టిడిపి మూడవ వార్డ్ మాజీ కార్పొరేటర్ గంటా నూకరాజు, రెండో వార్డ్ మాజీ కార్పొరేటర్ గాడ్ చిన్ని కుమారి లక్ష్మి, మూడో వార్డ్ టిడిపి అధ్యక్షులు గొలగాని నరేంద్ర కుమార్, గాడు సన్యాసినాయుడు, మూడవ వార్డ్ వైఎస్ఆర్సిపి అధ్యక్షులు అల్లిపిల్లి నర్సింగ్ రావు, వాసుపల్లి కొండబాబు, చురకల రమణ, కనకల అప్పలనాయుడు, గాడ్ యశ్వంత్, కోరాడ రమణ, పాసి త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత ఏ జట్టుకు టెక్కలి త్రిపురాన విజయ్ ఎంపిక

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అభినందనలు



**టెక్కలి , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళం జిల్లా క్రికెట్ చరిత్రలో మరొక స్వర్ణ అధ్యాయం నమోదైంది. టెక్కలికి చెందిన యువ ఆల్ రౌండర్ త్రిపురాన విజయ్ భారత ఏ జట్టుకు ఎంపికయ్యాడు. ఆస్ట్రేలియా ఏ జట్టుతో పుదుచ్చేరీలో ఈ నెల 22వ తేదీ నుంచి జరగనున్న నాలుగు రోజుల రెండు క్రికెట్ మ్యాచ్ కోసం బిసిసిఐ అతడిని భారత జట్టులోకి తీసుకుంది. ఇటీవల ముగిసిన ప్రతిష్టాత్మక దులీప్ ట్రోఫీలో ఆకట్టుకునే ప్రదర్శన చేయడమే కాకుండా, ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి తన ఆల్ రౌండ్ నైపుణ్యంతో సత్తా చాటిన విజయ్.. ఇప్పుడు ఏకంగా భారత ఏ జట్టులో చోటు దక్కించుకోవడం విశేషం. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ, విజయ్‌ను ప్రశంసించారు: మన శ్రీకాకుళం జిల్లా నుంచి వచ్చిన యువ కెరటం త్రిపురాన విజయ్ భారత ఏ జట్టుకు ఎంపిక కావడం జిల్లా ప్రజలందరికీ ఎంతో గర్వకారణం. పట్టుదల, నిరంతర శ్రమ ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని విజయ్ నిరూపించాడు. ఆస్ట్రేలియా ఏ జట్టుతో జరిగే మ్యాచ్‌లో తన నైపుణ్యంతో రాణించి, త్వరలోనే భారత సీనియర్ జాతీయ జట్టులో కూడా స్థానం సంపాదించాలని ఆకాంక్షిస్తున్నాను అని అన్నారు. టెక్కలి నుంచి భారత ఏ జట్టు స్థాయికి చేరిన విజయ్ విజయం జిల్లాలోని యువ క్రీడాకారులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ, విజయ్ తండ్రి కృష్ణంరాజును మంత్రి అచ్చెన్నాయుడు శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా అఖిల భారత పాత్రికేయ సదస్సు

## సీనియర్ జర్నలిస్ట్ ఎం.ఎస్.ఆర్. ప్రసాద్‌కు మహోన్నత సత్కారం



**విశాఖపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయం వై.వి.ఎస్. మూర్తి ఆడిటోరియంలో భారతీయ శ్రమజీవి పత్రకార్ సంఘ్,నవ్యంధ్ర జర్నలిస్ట్స్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అఖిల భారత పాత్రికేయ సదస్సు అత్యంత ఘనంగా జరిగింది. సమాజ పురోగతిలో పాత్రికేయుల పాత్రపై విస్తృతంగా చర్చించిన ఈ సెమినార్ కు విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సదస్సు వేదికగా సీనియర్ పాత్రికేయులు, 'వి డిజిటల్' బ్యూరో చీఫ్ ఎం.ఎస్.ఆర్. ప్రసాద్ సమాజ శ్రేయస్సుకు, తోటి జర్నలిస్టుల సంక్షేమానికి అందిస్తున్న నిరంతర సేవలను కొనియాడుతూ ఆయనను ఘనంగా సత్కరించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన సుమారు 150 మంది జర్నలిస్టుల సమక్షంలో, కార్యక్రమ నిర్వాహకులు, అసోసియేషన్ అధ్యక్షులు, 'విశాఖ సమాచారం' సంపాదకులు సూరంపూడి వీరభద్రరావు , మాజీ పార్లమెంట్ సభ్యులు జి.వి.ఎల్. నరసింహారావు మరియు ఇతర ప్రముఖుల చేతుల మీదుగా ఆయనను ఆత్మీయంగా సన్మానించారు. ?సమాజంలో పాత్రికేయుల బాధ్యతను, వారి సేవలను చాటిచెప్పిన ఈ కార్యక్రమంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ జి.ఎస్.ఎన్. రాజు, నేషనల్ బిల్డర్స్ అసోసియేషన్ ట్రస్టీ చెరువు రామకోటయ్యతో పాటు పలువురు మేధావులు, ప్రముఖులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు .

### విశాఖపట్నంలో పర్యటన ముగించుకొని ముఖ్యమంత్రి తిరుగు ప్రయాణానికి

# ఎ.ఎస్.ఆర్. అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్ వద్ద విస్తృత భద్రత చర్యలు

## క్షేత్రస్థాయిలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ పూర్తి

**విజయనగరం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ లో సెప్టెంబర్ 19న లబ్ధిదారులకు ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని, తిరుగు ప్రయాణంలో భోగాపురంలో అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు చేరుకోనున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, సిఐఎస్ఎఫ్, జి.ఎం.ఆర్. మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో సమీక్షించారు. అనంతరం ఎయిర్పోర్టులోని ప్రాంతాలను క్షేత్రస్థాయిలో తిరిగి భద్రత చర్యలను పరిశీలించారు. ఎయిర్ పోర్ట్ భద్రత విధులు నిర్వహించే సీఆర్పీఎఫ్ అధికారులు, ఇతర శాఖల అధికారులు, స్థానిక పోలీసులతో జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సమావేశమై, ముఖ్యమంత్రి భద్రత విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన భద్రత చర్యలు గురించి దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుండి అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు హెలికాప్టర్ లో సెప్టెంబర్ 19, సాయంత్రం చేరుకొని, హైదరాబాద్ కు విమానంలో వెళ్లనున్న నేపథ్యంలో భద్రతాపరమైన చర్యలు చేపట్టామన్నారు. ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలోనే ముఖ్యమంత్రి గారు కొద్ది సమయం వేచి ఉండేందుకు సేఫ్ హౌస్, అత్యవసర వైద్యం అందించేందుకు సేఫ్ హాస్పిటల్ ఎయిర్ పోర్ట్ ప్రాంగణంనులోనే ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్స్, డాగ్ స్క్వాడ్ మరియు స్పెషల్ పార్టీ బలగాలతో ఎయిర్ పోర్ట్ ప్రాంగణంలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. విధుల పట్ల ఎలాంటి అలసత్వం వద్దని, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు పూర్తి అప్రమత్తంగా ఉండి,



పర్యటన ముగిసేవరకు నిరంతర నిఘా కొనసాగించాలను భద్రత అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ గారి వెంట ఎఆర్ అదనపు ఎస్పీ పి.కిరణ్ కుమార్, బొబ్బిలి డిఎస్పీ ఆర్.గోవిందరావు మరియు భోగాపురం సిఐ కే.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



# నకిలీ ఫోన్ ప్లేతో బురిడీ

- ఏటీఎంల వద్ద నగదు తీసుకుని నకిలీ స్క్రీన్తో మోసం నలుగురి అరెస్ట్..
- 2.04 లక్షలు రికవరీ.. క్రైమ్ ఏడీసీపీ ఎన్.రమ్య



**గాజువాక , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** ఏటీఎం, సీడీఎం కేంద్రాల వద్ద నగదు జమ చేసేందుకు వచ్చే వారిని లక్ష్యంగా చేసుకుని ఫేక్ ఫోన్పే స్క్రీన్ చూపిస్తూ మోసాలకు పాల్పడుతున్న ముఠాలోని నలుగురు సభ్యులను విశాఖ సిటీ సౌత్ సబ్ డివిజన్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.2,04,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శు క్రవారం గాజువాక పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో క్రైమ్ ఏడీసీపీ ఎన్.రమ్య వివరాలు వెల్లడించారు. ఈ నెల 10న బీహెచ్పీవీ ఎస్ బీఐ ఏటీఎం వద్ద టోరా వెంకటరమణ రూ.54 వేల నగదును ఖాతాలో జమ చేసేందుకు వెళ్లారు. అదే సమయంలో బుద్ద హేమసాయి అలియాస్ సాయి అత్యవసరంగా నగదు అవసరమైందని నమ్మించి, నగదును తనకు ఇవ్వాలని కోరాడు. నగదు తీసుకున్న అనంతరం ఫోన్ పే ద్వారా డబ్బులు పంపినట్లు నకిలీ స్క్రీన్ చూపించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే బాధితుడి ఖాతాలో నగదు జమ కాకపోవడంతో గాజువాక క్రైమ్ పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఫుటేజీతో పాటు సాంకేతిక ఆధారాలను పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించారు. బుద్ద హేమసాయి, కోరుబిల్లి తరుణ్, శరగడం మురారి, జంబాల గౌతమ్ గగన్చాంద్లను ఈ నెల 17న శ్రీనగర్ ఎస్బీఐ ఏటీఎం వద్ద అరెస్టు చేశారు.

### ఐదుగురు ముఠాగా..

పోలీసుల విచారణలో సూరిశెట్టి హేమంత్తో కలిసి మొత్తం ఐదుగురు ముఠాగా ఏర్పడి ఇదే తరహాలో మోసాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. నిందితుడు హేమంత్ పరారీలో ఉన్నట్లు ఏడీసీపీ తెలిపారు. నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన తొమ్మిది కేసుల్లో రూ.2,07,500 మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఇప్పటివరకు రూ.2,04,500 నగదును రికవరీ చేసినట్లు వెల్లడించారు. గతంలో నమోదైన కేసులను కలుపుకుంటే ఈ ముఠాకు నగర పరిధిలో మొత్తం 14 కేసులతో సంబంధం ఉన్నట్లు తెలిపారు. మరిన్ని ఘటనలపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు.

### నగదు ఇచ్చే ముందు జాగ్రత్త..

గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్పే ద్వారా నగదు పంపినట్లు చూపించి, తమకు నగదు ఇవ్వాలని కోరితే అప్రమత్తంగా ఉండాలని ఏడీసీపీ రమ్య సూచించారు. ఫోన్పే లావాదేవీకి సంబంధించిన స్క్రీన్షాట్ను మాత్రమే నమ్మకుండా, తమ బ్యాంకు ఖాతాలో నగదు వాస్తవంగా జమ అయిందో లేదో నిర్ధారించుకున్న తర్వాతే నగదు ఇవ్వాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసులకు ప్రత్యేక సమావేశం : సిపి డా.శంఖబ్రత బాగ్చి





**విశాఖపట్నం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విశాఖపట్నంలో పర్యటించనున్న సందర్భంగా నగర సిపి శంఖబ్రత బాగ్చి బంధవస్తుపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.నగర పోలీస్ అధికారులు డి.సి.పి-1, డి.సి.పి-2, డి.సి.పి క్రైమ్స్, డి.సి.పి అడ్మిన్, నగర ట్రాఫిక్ అధికారులు, ఏ.డి.సి.పి లు, ఏ.సి.పి లు, సంబంధిత సీఐ లు, బి.డి టీం, డాగ్ స్క్వాడ్, పి.ఎస్.ఓ లు, ఇతర సిబ్బంది పాల్గొన్న ఈ సమావేశం నందు ముఖ్యమంత్రి పర్యటనలో ఎటువంటి అవరోధాలు లేకుండా అన్ని శాఖలను సమన్వయపరచుకుంటూ బందోబస్తు విధులు నిర్వర్తించాలని పోలీసు కమిషనర్ పలు అదేశాలు జారీ చేశారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన బహిరంగ సభకు వివిధ ప్రముఖులతో పాటు వేలాది మంది లబ్ది దారులు మరియు వివిధ ప్రాంతాల నుండి ప్రజలుకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను, ఆంధ్రా యూనివర్సిటీ నందు సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను స్వయంగా పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఉన్నతాధికారులతో కలిసి పర్యటించి భద్రత చర్యలు పర్యవేక్షించడమైనది.





# యం. కోడూరు-1 అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా 'పోషణ్ మాసోత్సవాలు'

**- చిన్నారుల సమగ్ర వికాసానికి పోషకాహారమే అసలైన పునాది**
**- అంగన్‌వాడీ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: సెక్టర్ సూపర్‌వైజర్ వి. ఈశ్వరమ్మ**
**- ప్రధానమంత్రి మాతృ వందన యోజన తదితర పథకాలపై తల్లులకు విస్తృత అవగాహన**

**వి. మాడుగుల , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం యం. కోడూరు-1 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం 'పోషణ్ మాసోత్సవాలు' అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి, సంపూర్ణ ఆరోగ్య వంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీడీపీఓ జి. ఎర్రియమ్మ ఆదేశాల మేరకు ఈ ప్రత్యేక అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సెక్టర్ సూపర్‌వైజర్ వి. ఈశ్వరమ్మ ముఖ్య అతిథిగా హాజరై, సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల సమగ్ర శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని నొక్కి చెప్పారు. గర్భం దాల్చినప్పటి నుంచే తల్లి తీసుకునే ఆహారంపైనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు,





బాలింతలకు, చిన్నారులకు ప్రతిరోజూ అందిస్తున్న పౌష్టికాహారాన్ని ఎలాంటి అపోహలు లేకుండా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

**పథకాలు, ప్రాథమిక విద్యపై అవగాహన:**

అనంతరం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రధానమంత్రి మాతృ వందన యోజన' పథకం ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాలు, దానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి అనే విషయాలను తల్లులకు విడమర్చి చెప్పారు. అలాగే బాలల వికాసం, వారి ప్రవర్తన, పునాది స్థాయి నుంచే ప్రాథమిక విద్య ప్రాముఖ్యత గురించి తల్లిదండ్రులకు పలు కీలక సూచనలు చేశారు. పిల్లలను క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, జి. పద్మావతి సమన్వయం చేసి విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో పాటు పెద్ద సంఖ్యలో గర్భిణులు, బాలింతలు, స్థానిక తల్లిదండ్రులు, మహిళలు ఆసక్తిగా పాల్గొని అధికారుల సూచనలను అడిగి తెలుసుకున్నారు.

# భీమిలి వైసీపీ ఇంచార్జ్‌గా బొత్స అనూష?

**త్వరలోనే కీలక ప్రకటన!**



**ఆనందపురం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** వైసీపీలో తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు భీమిలి నియోజకవర్గంపై ఆసక్తికరమైన చర్చకు దారితీస్తున్నాయి. ఇటీవల మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను వైసీపీకి రాజీనామా చేయడంతో భీమిలి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త పదవి ఖాళీ అయింది. చిన్న శ్రీను వైసీపీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి ఇన్‌చార్జ్ బాధ్యతలకు కూడా రాజీనామా చేశారు. ఈ నేపథ్యంలో భీమిలి నియోజకవర్గానికి కొత్త ఇన్‌చార్జ్‌ను నియమించే అంశంపై వైసీపీ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పదవికి వైసీపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ కుమార్తె బొత్స అనూష పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. త్వరలోనే ఆమెను భీమిలి వైసీపీ ఇన్‌చార్జ్‌గా ప్రకటించే అవకాశం ఉంది. ఇప్పటికే బొత్స అనూష పేరు విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికి సంబంధించి రాజకీయ చర్చల్లోకి వచ్చింది. అదే సమయంలో చిన్న శ్రీను వైసీపీని వీడి టీడీపీలో చేరడం, తన కుమార్తె సిరి సహస్రతో కలిసి రాజకీయంగా కొత్త అడుగు వేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అయితే అనూషకు భీమిలి బాధ్యతలు అప్పగించే అంశంపై వైసీపీ అధిష్టానం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తుంది. త్వరలో పార్టీ అధికారిక నిర్ణయం వెల్లడించనుంది. ఒకవేళ అనూషకు బాధ్యతలు అప్పగిస్తే మరోసారి బొత్స వేదికగా రాజకీయ వర్గాల్లో మరింత చర్చ జరిగే అవకాశం ఉంది.



# అగ్రి బిజినెస్ లో వినూత్న కు బంగారు పతకం...!!

## పి హేమలత ఐఎఎస్ చేతుల మీదుగా అందజేత..పలువురి అభినందనలు



**గాజువాక , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** అగ్రికల్చర్ బిజినెస్ మేనేజ్మెంట్ లో లోడగల వినూత్న బంగారు పథకం (గోల్డ్ మెడల్ )సాధించింది. విశాఖపశ్చిమనియోజకవర్గం పారిశ్రామికప్రాంతం జీవీఎంసీ 60వ వార్డ్ శ్రీహరిపురం వుడాకాలనీ లో నివాసం ఉంటున్న ఆమె బుధవారం బెంగళూర్ లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మానేజ్మెంట్ (ఐ ఐ పి ఎం ) యూనివర్సిటీ లో జరిగిన కాన్వకేషన్ కార్యక్రమంలో పి హేమలత ఐ ఎ ఎస్ చేతులమీదుగా ఈ బంగారు పతకాన్ని అందుకుంది. 2022-2024 లో బెంగుళూరు ఐ ఐ పి ఎం యూనివర్సిటీ లో అగ్రికల్చర్ బిజినెస్ మానేజ్మెంట్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆమె యూనివర్సిటీ కి టాపర్ గా నిల్చి ఉత్తమ ప్రతిభ కనబరచి ఉత్తీర్ణత సాధించడంతో ఆమె కు యూనివర్సిటీ బంగారు పతకాన్ని అందజేశారు. ప్రస్తుతం క్యాంపస్ సెలక్షన్ లో సెలెక్ట్ అయిన ఆమె కోరోమండల్ ఇంటర్నేషనల్ ఫర్టిలైజర్ లిమిటెడ్ లో కాకినాడ జిల్లా మార్కెటింగ్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతచదువులకోసం విదేశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు ఆమె తెలిపారు. దింతో తోటి విద్యార్థులు,యూనివర్సిటీ ప్రొఫెసర్స్, కుటుంబ సభ్యులు,స్నేహితులు,బంధువులు,అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు విలువలతో కూడిన విద్య ను మంచి నడవడికను నేర్పిన గురువులకు,తల్లిదండ్రులకు ధన్యవాదములని,అలాగే తనకు తన ఉన్నతిని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపిన ప్రతీఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఇదిలా ఉండగా వినూత్న తండ్రి రాజు యాదవ్ వార్త దినపత్రికలో స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేస్తున్నారు. తన కుమార్తె సాధించిన విజయంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు.



# అవంతి కళాశాలలో విద్యార్థులకు విస్తృత అవగాహన సదస్సు





**మాకవరపాలెం , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాలు నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షణలో మాకవరపాలెం మండలంలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు నేరాల నియంత్రణ, చట్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దామోదర్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ సి.పి.వి.ఎన్.జె.మోహన రావు, అధ్యాపక బృందం మరియు సుమారు 350 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.?ఈ సందర్భంగా అధికారులు పలు కీలక అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు: ర్యాగింగ్ నిరోధం కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా ఎదురయ్యే తీవ్ర పరిణామాలు, క్రిమినల్ కేసులు విద్యార్థుల భవిష్యత్తును ఎలా నాశనం చేస్తాయో వివరించారు. సైబర్ నేరాలు ఒ సోషల్ మీడియా: ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ లింకులు, సోషల్ మీడియా వేదికల దుర్వినియోగం వల్ల కలిగే ముప్పుపై హెచ్చరిస్తూ.. డిజిటల్ పరికరాలను సురక్షితంగా ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు – రోడ్డు భద్రత: విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వినియోగం, ట్రిపుల్ రైడింగ్ మరియు ర్యాష్ డ్రైవింగ్ మానుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నివారణ : డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల వినియోగం శారీరక, మానసిక ఆరోగ్యంపై చూపే దుష్ప్రభావాలను వివరిస్తూ, వాటికి దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కెరీర్ గైడెన్స్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువులో రాణించడం ద్వారా సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలను వివరించారు.

**'శక్తి ' యాప్‌పై ప్రత్యేక అవగాహన:**

మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం ప్రత్యేకంగా రూపొందించిన ‘శక్తి’ యాప్ పనితీరును సీఐ రేవతమ్మ వివరించారు. “ఈ యాప్ మీ మొబైల్‌లో ఉంటే, మీ వెంటే పోలీసులు ఉన్నట్లే” అని భరోసా ఇచ్చారు. ఆపద సమయంలో యాప్‌లోని ఎస్వోఎస్ బటన్ నొక్కడం ద్వారా తక్షణ పోలీసు సహాయం పొందవచ్చని, ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అలాగే మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన పలు చట్టాలు, రక్షణ నిబంధనలపై అవగాహన కల్పించారు. యువత సరైన మార్గంలో నడిచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అధికారులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# అర్జీలను పరిష్కరించాడంలో అలసత్వం వహించ రాదు : జిల్లా కలెక్టర్ నిషాంతి



**అల్లూరి జిల్లా పాడేరు , సెప్టెంబర్ 18 ( మనం న్యూస్ ) :** అల్లూరి జిల్లా, సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక( పి జి ఆర్ ఎస్ ) కు 101 , అందులో రెవెన్యూ క్లినిక్ కు 78 మొత్తం 199 వినతులు వచ్చాయి. ఈపి జి ఆర్ ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిషాంతి. టి , పాడేరు ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ, డిఆర్ఓ ఏం వి ఎస్ లోకేశ్వరరావు, ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి జిల్లా అధికారులతో కలసి సంయుక్తంగా వివిధ మండలాలలోని, గ్రామాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. అర్జీ దారుల నుండి స్వీకరించిన అత్యవసర ఫిర్యాదులను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న నియోజకవర్గాల పరిధిలో ప్రతి మండలంలో వారంలో ఒకరోజుగా జిల్లా అధికారులు సమక్షంలో ఒక పిజిఆర్ఎస్ ను , మండల అధికారుల అధ్యక్షతన మండలంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్ ను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి శుక్రవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి తప్పనిసరిగా జిల్లా అధికారి ఆయా శాఖకు సంబందించిన సమగ్ర సమాచారంతో హాజరుకావాలని అలా హాజరుకాలేని అధికారి ముందుగానే అనుమతి పొందాలని ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ లో అధికారి మాత్రమే ఉండాలి, అర్జీదారుని నమోదు కౌంటర్ దగ్గర కింద స్థాయి శాఖ అధికారులు ఉండాలని తెలిపారు.అర్జీదారునితో పాటు అధికారి వచ్చి సమస్య వివరించాలన్నారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని అలా లేని ఎడల వారిపై తగు శాఖపరమైన చర్యలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి గ్రామంలో గ్రామస్థాయి పిజిఆర్ఎస్ ను నిర్వహించి ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యను వెంటనే పరిష్కరించే దిశగా ఆలోచన చేయాలన్నారు. మండల స్థాయిలో వచ్చే అర్జీలను మండల స్థాయి లోనే పరిశీలించినట్లయితే, జిల్లా స్థాయిలో ఎక్కువ మంది ప్రజా ఫిర్యాదులు రావని, అలాగే ఫిర్యాదులు సంఖ్య తగ్గుతాయని తద్వారా వాటిని అధికారులు వెంటనే పరిష్కరించ జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్క జిల్లా అధికారులకు శాఖ పరమైన పూర్తి వివరాలతో పి జి ఆర్ ఎస్ లో రావాలని పార్కొన్నారు.అర్జిదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని, అర్జీలు నేటికీ పరిష్కారం కాకపోయినా, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చున్నారు.